క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం



ధర్మాపురంలో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి

పెద్దపప్పూరు: అవ్వా..తాత..చెల్లి.. జరగబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపిద్దామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన ధర్మాపురంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం నుంచి అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, ఎంపీటీసీ అనీల్ కుమార్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ పెద్దిరెడ్డి, సర్పంచు మాదినేని రమేష్ నాయుడు, సీనియర్ నాయకుడు నామనాంకపల్లి రఘునాథ రెడ్డి, దబ్బర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రామ్మోహన్

తాడిపత్రి అర్బన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా రామ్మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ సిబ్బంది నూతన కమిషనర్‌కు స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ జి.రవి శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో గుంటూరు జిల్లా నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా రామ్మోహన్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ అధికారులతో సమావేశం నిర్వహించడంతోపాటు రికార్డులను పరిశీలించారు.

పోలీసుల నాకాబందీ



సోదాలు చేస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: మేడిమాకుపల్లిలో బుధవారం పోలీసులునాకా బందీ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో ఉండే ప్రజలు శాంతి యుతం గా జీవించాలని యాడికి సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన దేవునిఉప్పలపాటు, రెడ్డిపల్లిలో బుధవారం పోలీసులు నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. గ్రామాల్లో గొడవల జోలికి వెళ్లకూడదని ప్రజలకు సూచించినట్లు ఎస్ఐ శరత్‌చంద్ర పేర్కొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

యాడికి: మండల కేంద్రానికి చెందిన నాగేశ్వర రెడ్డి నాటుసారా విక్రయిస్తుండగా బుధవారం పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 9 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

నగరేశ్వరాలయంలో పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని కోట ముఖ ద్వారం వద్ద వెలిసిన అతి పురాతనమైన నగరేశ్వరాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలాధారులు, శివ భక్తుల ఆధ్వర్యంలో వర్షాలు కురవాలని కోరుతూ స్వామికి విశేష పూజలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. నగరేశ్వరాలయంలో పూజలు చేస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని భక్తుల నమ్మకం. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే ఉపేక్షించం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్

పెద్దపప్పూరు: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఆధిపత్యం కోసం సమస్యలు సృష్టిస్తే ఉపేక్షించేదిలేదని ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల జోలికి వెళ్లడం వల్ల వారి జీవితాలతో పాటు పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుదన్నారు. గ్రామాల్లో ఎటువంటి చిన్నపాటి సమస్య వచ్చినా సొంత నిర్ణయం తీసుకోకుండా ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

సచివాలయాలు.. సేవాలయాలు

- గ్రామాల్లోనే అందుతున్న ప్రభుత్వ సేవలు
- ప్రజలకు తగ్గిన వ్యయప్రయాసలు
- హర్షం వ్యక్తం చేస్తున్న జనం



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు నవిత. బుక్కరాయసముద్రంలోని రామస్వామి ఎగువ గేరులో నివశిస్తోంది. భర్త ఎల్లప్ప బిల్డింగ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. వీరికి శాలిని అనే 4 ఏళ్ల కుమార్తె ఉంది. అయితే ఎల్లప్ప, భార్య నవిత ఆధార్ అప్డేట్ కోసం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ఆ తర్వాత గ్రామ సచివాలయంలోని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కార్డులు ఉచితంగా ఇస్తారని వలంటీర్ ద్వారా సమాచారం తెలుసుకున్నారు. వారి ద్వారా దరఖాస్తు చేసుకోగానే గంటల వ్యవధిలో సచివాలయంలో ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్ చేయడంతో పాటు ఆధార్ అప్డేట్ చేసి ఎవరి ప్రమేయం లేకుండా ఉచితంగా ఆధార్ కార్డు వచ్చింది. జగనన్న పేదల కోసం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని నవిత ఆనందం వ్యక్తం చేసింది.



పెరవలి సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న దృశ్యం

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లకుండానే అన్ని పనులు సచివాలయాల్లోనే చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని ప్రభుత్వ సేవలు గ్రామ/వార్డు సచివాలయాల్లోనే పూర్తవుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఖర్చులు తగ్గడంతోపాటు సకాలంలో పనులు జరుగుతున్నాయని సంబరపడుతున్నారు.

అన్ని సేవలు సచివాలయాల్లోనే...

రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ప్రతి 2500 జనాభాకు గ్రామ/వార్డు సచివాలయం ఏర్పాటు చేసింది. సచివాలయంలో 11 మందిని సిబ్బందిని నియమించి సేవలందిస్తోంది. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారంతోపాటు వాటికి ఎవరు అర్హులో తెలుసుకుని వారికి పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలతోపాటు రైతులకు 1బీ, పట్టాదారు పాసు పుస్తకాలు, ఆరోగ్యశ్రీ కార్డులు, జనన, మరణ, కులం, ఆదాయం, వివాహం ధ్రువీకరణ ప్రతాలు ఇలా దాదాపు 550 సేవలు అందిస్తున్నారు.

శింగనమల నియోజకవర్గంలోని సచివాలయాల వివరాలు..

మండలం	సచివాలయాలు	సచివాలయ సిబ్బంది	వలంటీర్లు
శింగనమల	13	130	249
గార్లదిన్నె	16	160	324
బుక్కరాయసముద్రం	18	180	354
నార్పల	16	160	282
పుట్లూరు	14	140	201
యల్లనూరు	14	140	201
మొత్తం	91	910	1611

జగనన్నకు కృతజ్ఞతలు



గతంలో ఆధార్ వివరాలు నమోదు చేయాలంటే మండల కేంద్రంలోని మీ-సేవ కేంద్రానికి వెళ్లి చేయించుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గ్రామంలోనే ఆధార్ సేవలు పొందుతున్నాం. ఎక్కడికీ వెళ్లకుండా గ్రామంలోనే ఆధార్ సేవలు పొందుతున్నాం. సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టిన జగనన్నకు కృతజ్ఞతలు.

–దాసరి వీరనారాయణ, పెరవలి, శింగనమల మండలం

నాకు పింఛన్ మంజూరు చేశారు



నాకు చేయి బాగులేకుంటే దివ్యాంగుల సర్టిఫికెట్ మంజూరు చేశారు. మా వలంటీర్ దృష్టికి తీసుకెళ్లితే, పింఛన్‌కు నమోదు చేయించి , నా ధ్రువీకరణ పత్రాలు సచివాలయానికి తీసుకెళ్లి మంజూరు చేయించారు. సచివాలయం పెట్టడం వల్ల మా వలంటీర్ వెంటనే నమోదు చేయించడంతో పింఛన్ మంజూరు కావడం చాలా సంతోషంగా ఉంది. ఈసేవలు పెట్టిన జగనన్నకు కృతజ్ఞతలు.

– సావిత్రి, శింగనమల

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం



కల్లుమడిలో ప్రచారం చేస్తున్న సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా మరోసారి చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. బుధవారం ఆయన కల్లుమడి, తరిమెల గ్రామాల్లో పర్యటించారు. ఆయాగ్రామాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చరాన్నారు. ప్రతి సంక్షేమ పథకం ప్రతి ఇంటికీ చేరిందని, పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికీ ఎంతో ఉపయోగపడిందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకుందామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో కేవలం జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందాయన్నారు. కాని జగనన్న పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ కుల, మత, పార్టీ భేదం లేకుండా అందించారన్నారు. సర్పంచ్ పక్కీరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండయ్య, భాస్కర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, నల్లప్ప, వెంకటేష్, రామూర్తి, సుబ్బన్న, రామాంజినేయులు, తరిమెల నాయకులు ఎంపీటీసీ రమేష్ బాలిరెడ్డి, కోటేశ్వరెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వెంకట, మహేశ్వర, నాగవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



అబ్బేదొడ్డిలో చీనీ మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: చీనీ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.సుబ్రమణ్యం, సిట్రస్ రిసెర్చ్ స్టేషన్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.దత్తారెడ్డి, అనంతపురం హెచ్‌ఆర్ఎస్ శాస్త్రవేత్త ముకుంద లక్ష్మి సూచించారు. బుధవారం అబ్బేదొడ్డి, పెద్దొడ్డిలో చీనీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీనీ మొక్కల చుట్టూ పాదులు తీసి తడి పెట్టి డైథేన్-ఎం 45 మూడు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పది రోజుల తరువాత బావిస్టిన్ రెండు గ్రాముల లీటరు నీటిలో కలిపి చెట్టు పాదల్లో పోయాలన్నారు. సూక్ష్మ ధాతు లోపాలు, వాటి నివారణపై రైతులకు వివరించారు. చీనీ మొక్కల్లో వేరుకుళ్లు, పశు ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు గోవర్ధన్‌రెడ్డి, కాంతారెడ్డి, హెచ్ఓ మిత్రవింద మాధవి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: వేసవి నేపథ్యంలో శివారు కాలనీలతో పాటు అత్యవసరమైనప్పుడు ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కౌన్సిలర్లు విద్యారాణి, నాగరత్నమ్మ, సుమోబాషా కోరారు. బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవానీ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం జరిగింది. మూలనపడిన వాహనాలను రిపేరీ చేయించి వాటిని వినియోగించాలని, తనవార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్ కృపాకర్ కోరారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, పైప్‌లైన్‌ల ఏర్పాటుతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ధర్మవరం రైల్వేగేట్ వద్ద సీ-టైప్ ఆర్‌యూబీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో తాగునీటి పైప్‌లైన్ల మార్పునకు అవసరమయ్యే రూ.98 లక్షలను రైల్వే శాఖ జమ చేసే నిధులతో గానీ లేదా మున్సిపల్ సాధారణ నిధులను ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదించింది. కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

యాడికి: జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఆయన్ను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వేములపాడు రహదారి, కోమటిబజార్, కుంట వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా కులమతాలు, పార్టీలకు అతీతంగా లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్న వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేస్తూ నిర్వీర్యం చేయడానికి ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీ నర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి, సీనియర్ నాయకులు బాలారమేష్ బాబు,బోగాతి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్, సచివాలయ మండల కన్వీనర్ శివ ప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్నప్ప, రాగుల వెంకటరామిరెడ్డి, శివకేశవరెడ్డి, మోపిరెడ్డి, నాగేష్, బాస్కర్ రెడ్డి, దేవనాథరెడ్డి, కొండారెడ్డి, చిన్న వెంకట నాయుడు, గుడిపాడు వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన



గుంతకల్లులో హెల్త్ రిపోర్ట్‌ను అందిస్తున్న డాక్టర్ సజీవ్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సజీవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంప్ నందుకు వైద్యనిపుణులు డాక్టర్ రామాంజినేయులు, డాక్టర్ ఆస్మా పర్వీన్, హుసేన్‌లు పాల్గొని 362 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారందరికీ మందులను ఉచితంగా అందజేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: స్థానిక 9వ వార్డు సచివాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు ఎల్లప్ప, వెంకట రమణారెడ్డి లు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు మహబూబ్ జాన్, అశ్వరాముడు, వైఎస్సార్ సీపీ నాయకులు దస్తగిరి, అశ్వ మారెన్న, అశ్వ సురేష్ పాల్గొన్నారు.

2న కల్లూరులో రాతిదూలం లాగుడు పోటీలు

గార్లదిన్నె: కల్లూరులో సింగరప్ప తిరునాల్లో భాగంగా మార్చి 2న ఆరు పళ్ల ఎద్దులకు రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దాతల సహ కారంతో రాతిదూలం పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా రూ. 40వేలు, రూ.30 వేలు, రూ.25వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు నగదు అందజేస్తామన్నారు. వివరాలకు 9704753612, 9177734985 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థికి ఆపన్నహస్తం



పాఠశాల సెక్రటరీకి నగదు అందిస్తున్న ఉపాధ్యాయురాలు సుజాత

పెద్దపప్పూరు: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి హైదరాబాద్ వాసులు ఆపన్నహస్తం అందించారు. వివరాలు.. అమ్మలదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న చిక్కేపల్లికి చెందిన లోహిత్ కుమార్ బ్లడ్ క్యాన్సర్‌తో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సుజాత విషయాన్ని తమ బంధువులైన హైదరాబాద్‌కు చెందిన మురళి, హర్షకు తెలియజేయడంతో వారు రూ.20 వేలు పంపారు. ఈమేరకు ఉపాధ్యాయురాలు బుధవారం నగదును పాఠశాల సెక్రటరీ ధనుంజయనాయుడుకు అందజేసింది. దీంతో ఆయన వెంటనే డబ్బును ఫోన్ పే ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు పంపారు.

పామిడి ఎస్ఐగా బెస్తరాజు



పామిడి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ఎం బెస్తరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ షేక్ చాంద్‌బాషా సీఐగా పదోన్నతిపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో బెస్తరాజు నియమితులయ్యారు.

1,287 మందికి 'రైతు భరోసా'

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా 1,287 మంది రైతులకు రైతు భరో సా,పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల బ్యాంకు ఖాతాల్లో నగదు జమైందని ఏఓ సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఏఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించి బటన్ నొక్కి నగదు బ్యాంకులో జమ చేశారన్నారు. సున్నా వడ్డీ పథకం కింద 2022 ఖరీఫ్‌లో 1287 మంది రైతులకు రూ.29 లక్షలు, 2021 రబీ కింద 154 మందికి రూ.1.65 లక్షలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు.

ప్రశాంతంగా మార్కెట్ వేలం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం దినసరి మార్కెట్, జంతు వధశాల నుంచి సుంకం వసూలు చేసుకునే హక్కు కోసం నిర్వహించిన వేలం పాట ప్రశాంతంగా జరిగింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఉదయం 11 గంటలకు వేలం పాట ప్రారంభించారు. రూ. 19 లక్షలకు దినసరి మార్కెట్‌ను రఫి అనే వ్యక్తి, రూ. 27,500లకు జంతు వధశాలను షాషావలి అనే వ్యక్తి దక్కించుకున్నాడు. గతేడాదికంటే ఈ ఏడాది రూ.8,500 అధికంగా ఆదాయం వచ్చింది.

ప్రజారోగ్యమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం



హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: ప్రజారోగ్య పరిరక్షణే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్. భవాని తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యూనిసెఫ్, మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ స్టేషన్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఉద్యోగ, సిబ్బంది కోసం హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కమిషనర్ వెంకటరమణయ్య, మెప్మా సీఎంఎం భవాని, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, సీఓలు, టీఎల్ఎఫ్ లీడర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్త కావాలి



తాడిపత్రిలో ఊపిరితిత్తుల పనితీరుపై ఎంఈఓకు వివరిస్తున్న విద్యార్థులు



గుత్తి మండలం బేతాపల్లిలో నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుత్తి రూరల్: ప్రతి విద్యార్థీ సైన్స్‌పై అవగాహన పెంచుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని హెచ్‌ఎంలు శ్రీధర్‌గౌడ్, మహాలక్ష్మి, ఉపాధ్యాయుడు రామకృష్ణయ్య, మాదన్న పేర్కొన్నారు. తొండపాడు, బేతాపల్లిజెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వివిధ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పద్మవాణి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను ఎంఈఓ నాగరాజు ప్రారంభించారు. ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు చేసిన నమూనాల ప్రదర్శనలను తిలకించారు. ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పెద్దపోలమడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాలలో సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయుడు శివరామిరెడ్డి తన అవ్వ తిమ్మక్క జ్ఞాపకార్థం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక టీసీ హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆన్‌లైన్ ఐడియల్ పోటీల్లో నలుగురికి, క్విజ్‌లో 9 మందికి, వ్యాసరచన పోటీల్లో ముగ్గురు చొప్పున మొత్తం 16 మంది విద్యార్థులకు గురువారం బహుమతులు అందిస్తామని హెచ్‌ఎం రామకుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా పట్టణంలోని చైతన్య స్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్ సీఈఓ సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

ఎస్ఆర్‌ఐటీలో జాతీయ సైన్స్ డే

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగం, ఎన్‌డీఎల్ఐ క్లబ్ సంయుక్తంగా బుధవారం జాతీయ జాతీయ సైన్స్ డే నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్‌జీఆర్‌వై శాస్త్రవేత్త డాక్టర్ జవహర్‌కుమార్ హాజరై మాట్లాడారు. ప్రపంచంలో సైన్స్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సైన్స్‌పై దృష్టి సారించాలన్నారు. కళాశాల టీపీఓ రంజిత్‌రెడ్డి, విజయలక్ష్మి, ఉమా మహేశ్వరి, మల్లిక, లక్ష్మి కళ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పుట్లూరు: స్థానిక జెడ్పీఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ ప్రేమ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు పరిశీలించారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

యాడికి: వచ్చే నెల 3న తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీరామ్‌కుమార్ దేవరాజన్ పేర్కొన్నారు. ఆయా పీహెచ్‌సీల్లో బుధవారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన వైద్య సిబ్బంది, ఆశాలతో సమా వేశం నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దపప్పూరు: చాగల్లు గ్రామ సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.24,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.